ప్రజాశక్తి
ఆదివారం ఏప్రిల్ 21 2024 8 పేజీలు
శ్రీకాకుళం

23న చంద్రబాబు రాక!

ఆమదాలవలస : టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఈనెల 23వ తేదీన జిల్లాకు రానున్నట్లు తెలిసింది. పాతపట్నం, ఆమదాలవలసలో ప్రజాగళం సభల్లో ఆయన జిల్లాకు వస్తున్నారు. ఆరోజు ఉదయం పాతపట్నంలో, సాయంత్రం నాలుగు గంటలకు ఆమదాలవలసలో నిర్వహించే సభల్లో ఆయన ప్రసంగించనున్నారు. చంద్రబాబు పర్యటనకు సంబంధించిన వివరాలు అధికారికంగా వెలువడాల్సి ఉంది.

మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

ప్రచార ఖర్చులపై నిరంతర నిఘా

వ్యయ పరిశీలకులు నీనా నిగమ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎన్నికల ప్రచారానికి వ్యయ పరిమితికి మించి వెచ్చించే అవకాశమున్న ఆయా అభ్యర్థుల ఖర్చులపై నిరంతర నిఘా ఉంచాలని ఎన్నికల వ్యయ ప్రత్యేక పరిశీలకులు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి నీనా నిగమ్ ఆయా నోడల్ ఏజెన్సీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పలు రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల పర్యవేక్షణ, సాధారణ ఎన్నికల సన్నద్ధతపై నోడల్ అధికారులతో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అధ్యక్షతన జిల్లా ఎన్నికల పరిశీలకులు కోమల్‌జిత్ మీనా, శరవణ కుమార్, నవీన్ కుమార్ సోనీలతో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నంలో భాగంగా నగదు, బహుమతుల పంపిణీపై సి-విజిల్ వంటి అప్లికేషన్ల ద్వారా ఫిర్యాదు దాఖలు చేసేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఖర్చుల పర్యవేక్షణ, ఎన్నికల ప్రచారాన్ని తనిఖీ చేయడానికి ఇప్పటికే బృందాలు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలను స్వేచ్ఛగా, (మిగతా...2లో)

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

రాష్ట్రానికి బిజెపి ద్రోహం

- ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేనను ఓడించాలి
- తొత్తుగా మారిన వైసిపిని సాగనంపాలి
- ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలి
- సిపిఎం రాష్ట్ర నాయకులు పి.రోజా

ప్రజాశక్తి - మందస

ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి ద్రోహం చేసిందని సిపిఎం రాష్ట్ర నాయకులు పంచాది రోజా విమర్శించారు. మతతత్వ బిజెపితో పొత్తు పెట్టుకున్న టిడిపి, జనసేన పార్టీలను ఓడించాలని, బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తున్న వైసిపిని కూడా సాగనంపాలని పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన మండల కేంద్రంలో శనివారం బహిరంగ (మిగతా...2లో)

మూడో రోజు ఆరే...

ఎనిమిది సెట్ల నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో మూడో రోజు శనివారం నామినేషన్ల జోరు తగ్గింది. జిల్లాలో ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీల నుంచి పెద్దగా ఎవరూ నామినేషన్లు వేయలేదు. ఒక్క నరసన్నపేట స్థానానికి మాత్రం టిడిపి నుంచి బగ్గు రమణమూర్తి తన నామినేషన్ దాఖలు చేశారు. శ్రీకాకుళం అసెంబ్లీ స్థానానికి రాగోలు శివ, ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి బురిడి గౌరీశంకర్ జై భారత్ నేషనల్ పార్టీ నుంచి నామినేషన్ వేశారు. ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థి సీపాన శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. ఇచ్ఛాపురం అసెంబ్లీ స్థానానికి సుగ్గు చక్రవర్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. శ్రీకాకుళం పార్లమెంట్, పలాస, టెక్కలి, పాతపట్నం, ఎచ్చెర్ల అసెంబ్లీ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

28న షర్మిల రాక

పలాస : పిసిసి అధ్యక్షులు వై.ఎస్ షర్మిల ఈనెల 28వ తేదీన జిల్లాకు రానున్నారు. న్యాయ్ యాత్రలో భాగంగా టెక్కలి, పలాసలో పర్యటించనున్నారు. ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు టెక్కలి, రాత్రి 7.30 గంటలకు పలాసలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొనున్నారు. షర్మిల పర్యటను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు దువ్వాడ జీవితేశ్వరరావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, ఇండియా ఫోరం పార్టీల శ్రేణులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సభలను జయప్రదం చేయాలని కోరారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఇవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మండలంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. అక్కడ భద్రత, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు (మిగతా...2లో)

పోలీసులకు సూచనలు ఇస్తున్న ఎస్‌పి రాధిక

మున్సిపల్ కార్మికులపై పనిభారం తగ్గించాలి

కమిషనర్‌ను కోరిన ఫెడరేషన్ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో కార్మికుల సంఖ్యను పెంచి పనిభారాన్ని తగ్గించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) నగర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.బలరాం, ఎ.గణేష్ కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియాను శనివారం కలిసి సమస్యల పరిష్కారం కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ విస్తీర్ణం పరిధి గతం కంటే విస్తృతమైందని, పరిధి పెరిగినా పారిశుధ్య కార్మికుల సంఖ్య పెంచకపోవడం వల్ల కార్మికులపై పనిభారం పడుతోందని వివరించారు. పెరుగుతున్న పట్టణ అవసరాలకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని పలుమార్లు కోరుతున్నా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనివల్ల ఒత్తిడి పెరిగి కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. దీనికితోడు వేసవి తీవ్రత, పనిఒత్తిడి కారణంగా పడుతున్న ఇబ్బందులను ఆమెకు (మిగతా...2లో)

కార్పొరేషన్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

హామీలకే ష్యూరిటీ... అమలుకేదీ గ్యారంటీ?

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

బాబు ష్యూరిటీ... భవిష్యత్ గ్యారంటీ పేరుతో ఆరు రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తామంటూ టిడిపి ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సైతం ఇటీవల పలాసలో బహిరంగ సభల్లో ప్రస్తావించారు. వీటితోపాటు జిల్లాకు, పలాస నియోజకవర్గానికి పలు హామీలు గుప్పించారు. వాటిలో జీడి పిక్కలకు మద్దతు ధర ప్రధాన అంశంగా ఉంది. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు రావాల్సి ఉండగా, రూ.ఏడు వేలకే అమ్ముకోవాల్సి వస్తుందంటూ బాబు తెగ బాధపడ్డారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత జీడి బోర్డును ఏర్పాటు చేయడంతో, జీడి పంటకు మద్దతు ధర ఇచ్చి ఆదుకుంటామని హామీనిచ్చారు. బాబు ఇచ్చిన హామీలకు ష్యూరిటీ అయితే ఉంటుంది గానీ గ్యారంటీ మాత్రం ఉండదనేది గతానుభవాలు చెప్తున్నాయి. జిల్లాకు బాబు ఇచ్చిన ముఖ్యమైన హామీలను ఒకసారి పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. మత్స్యకారులకు ఎమ్మెల్సీ ఇస్తామంటూ 2014 ఎన్నికల్లో హామీనిచ్చారు. 2014-19 మధ్య జిల్లాలో ఆ సామాజిక తరగతికి చెందిన వారెవరికీ శాసనమండలిలో స్థానం కల్పించలేదు. శ్రీకాకుళంలో రా కదలి రా సభలో పాల్గొనేందుకు ఈ ఫిబ్రవరిలో వచ్చిన చంద్రబాబు మళ్లీ పాత పాటే పాడారు. మత్స్యకారులకు ప్రత్యక్ష ఎన్నికల్లో అవకాశం కల్పించలేక పోతున్నామని, వారికి ఎమ్మెల్సీ పదవి కేటాయిస్తామంటూ మరోసారి హామీనిచ్చారు. వంశధార-నాగావళి నదుల అనుసంధానం, ఆఫ్‌షోర్‌ను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీళ్లిస్తామని, జిల్లాను సస్యశ్యామలం చేస్తామంటూ సిఎం హోదాలో జిల్లాకు వచ్చిన ప్రతిసారీ అదే మాట వల్లించారు. గత ఖరీఫ్‌లో వంశధార నీరందక పలాస నియోజకవర్గంలో ఎండిన పొలాలను చూస్తే ఎంతమేర సస్యశ్యామలమైందో వేరే చెప్పనక్కర్లేదు. ఆఫ్‌షోర్ అంచనాలను పెంచి కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చారే తప్ప పలాస, టెక్కలి ప్రాంతాలకు సాగు, తాగునీరు ఇవ్వలేకపోయారు. దేశంలో ఎక్కడ నిర్మాణ పనులు జరుగుతున్నా శ్రీకాకుళం వారే ఉంటున్నారని, వెనుకబడిన జిల్లాను అభివృద్ధి చేసి ఇతర ప్రాంతాల వారే ఇక్కడకు వచ్చేలా జిల్లాను తీర్చిదిద్దుతామని అధికారంలో ఉన్నన్నాళ్లు చెప్తూనే వచ్చారు. వ్యవసాయ పనులు ముగిసిన వెంటనే (మిగతా...2లో)



ఎన్నికల శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న నవీన్

సక్రమంగా ఎన్నికల విధులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

ఎన్నికల విధులను బాధ్యతతో, సక్రమంగా నిర్వహించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పిఒ, ఎపిఒలు 699 మందికి ఇవిఎంల వినియోగం, ఎన్నికల విధులపై శనివారం అవగాహనా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారు. స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న ఇవిఎంలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె.వేణుగోపాల్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ మురళీధర్ నాయక్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న నాక్ బృందం సభ్యులు

నాక్ బృందం పరిశీలన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వసతులు, సౌకర్యాలు, బోధనా పద్ధతులను నాక్ బృందం శనివారం పరిశీలించింది. నాక్ బృందం సభ్యులు డాక్టర్ పరమేంద్ర బాజ్‌పాయి, డాక్టర్ జైదీప్ చౌదరి, హరిదాసు విధాత్ డిగ్రీ కళాశాలలో అన్ని విభాగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్ పాడి, అధ్యాపకులు నాక్ బృందం సభ్యులకు స్వాగతం పలికారు. కళాశాలలో బోధనా పద్ధతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కళాశాలలోని ల్యాబ్, బొటానికల్ గార్డెన్‌ను పరిశీలించిన అనంతరం ఫ్యాకల్టీ సభ్యులతో సమీక్షించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సమన్వయకర్త శివకుమార్, సంతోష్ కుమార్, నాగేశ్వరరావు, దుర్యోధన, రాజేంద్ర త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

కంట్రోల్‌రూమ్ పరిశీలన

శ్రీకాకుళం : ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు, విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి నీనా నిగమ్, ఎన్నికల పరిశీలకులు కోమల్ జిత్‌మీనా, శరవణ కుమార్, నవీన్ కుమార్ సోనీలతో కలసి నూతన కలెక్టరేట్ సముదాయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను శనివారం పరిశీలించారు. మీడియా మానిటరింగ్, మోడల్ కోడ్ కమిటీ, సోషల్ మీడియా, జిల్లా ఎక్స్‌పెండెంచర్ కమిటీ, కంప్లైంట్స్, రిపోర్టింగ్, మీడియా సెంటర్ విభాగాలను పరిశీలించారు. వాహనాల జిపిఎస్ సిస్టమ్, మద్యం చెక్‌పోస్టుల కోసం ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను తనిఖీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్, ఎస్‌పి జి.ఆర్ రాధిక ఆయా విభాగాలను పరిచయం చేసి, వాటి పనితీరును వివరించారు.

ప్రచార ఖర్చులపై నిరంతర నిఘా

నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లు, సన్నద్ధత ప్రణాళికపై సంతృప్తి వ్యక్తం చేశారు. స్వతంత్ర అభ్యర్థుల సహా రిజిస్టరై, గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థుల ప్రచార ఖర్చుల నమోదుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్యాంకుల నుంచి జరిగే అనుమానాస్పద నగదు లావాదేవీలు, ముఖ్యంగా రూ.ఐదు లక్షలకు మించిన నగదు డిపాజిట్లపై, మద్యం షాపులకు వెళ్లే సరుకు రవాణాపై నిరంతర నిఘా ఉంచాలన్నారు.

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ తొలుత ఎన్నికల పరిశీలకునికి జిల్లాలోని వ్యయ పర్యవేక్షణ బృందాల పనితీరు గురించి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, కంట్రోల్‌రూమ్, రాజకీయ ప్రచారానికి సంబంధించిన అనుమతుల వివరాలు, జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళిక కార్యకలాపాలు, ఎన్నికల సంబంధిత ఇతర అంశాలపై వివరించారు.

ఎన్నికల కోసం చేసిన భద్రతా ఏర్పాట్లను ఎస్‌పి జి.ఆర్.రాధిక వివరించారు. ఒడిశా సరిహద్దుగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, వాటి పనితీరు, సిబ్బంది గురించి వివరించి ఇప్పటివరకు సీజ్ చేసిన నగదు, మద్యం, బంగారం, గంజాయి వంటి వాటి వివరాలు, నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ల గురించి తెలిపారు. సమావేశంలో ఎఎస్‌పి ప్రేమకాజల్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ రాణీ మోహన్, సిపిఒ ప్రసన్నలక్ష్మి, తదితర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి బిజెపి ద్రోహం

సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావుతో కలిసి ఆమె మాట్లాడుతూ రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపితో టిడిపి, జనసేన జత కట్టడం ఎవరిని మోసం చేయడానికని ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ఫెడరల్ వ్యవస్థను పథకం ప్రకారం బిజెపి ధ్వంసం చేస్తోందని, పౌర హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. బిఎస్‌ఎన్‌ఎల్, పోస్టల్, బ్యాంకులు, ఇన్సూరెన్స్, రోడ్లు, పోర్టు, విద్యుత్, ఆయిల్ సెక్టార్, రైల్వే తదితర ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేసిందన్నారు. ప్రజల సంపదను, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంపదగా మార్చేస్తోందని విమర్శించారు. అటవీ హక్కుల చట్టాన్ని రద్దు చేసి, గిరిజనుల భూములకు రక్షణ లేకుండా చేసిందని చెప్పారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సంపాదించుకున్న కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా బిజెపి ప్రభుత్వం చేసిందని విమర్శించారు. కొండలను గనులను అంబానీ, అదానీకి ధారాదత్తం చేస్తోందన్నారు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర ఇవ్వలేదు సరే

మొదటి పేజీ తరువాయి

కదా భూములు అంబానీ, అదానీకి అప్పగించేస్తున్నారని విమర్శించారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలని, గిరిజన ప్రాంతాలను ఐదో షెడ్యూల్‌లో చేర్పించి 1/70 చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల భూములకు రక్షణ కల్పించాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వేజోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకుండా రాష్ట్రానికి ద్రోహం చేసిన బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించాలని ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం బలపరిచిన పలాస నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి మజ్జి త్రినాథరావు గెలిపించాలని కోరారు. సభలో సిపిఎం నాయకులు గణపతి, ఆర్.దిలీప్ కుమార్, మట్ట ధర్మారావు, కేశవరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మజ్జి బాబూరావు, కొర్ల హేమారావు చౌదరి, గిరిజన సంఘం నాయకులు సవర గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలి

వివరించారు. రోడ్లు ఊడ్చడం, కాలువలు తీయడం, చెత్తను ఎత్తుకోవడం ఒకరే చేయాల్సి వస్తోందన్నారు. ఈ పనులన్నీ చేయడం తలకు మించిన భారంగా ఉందన్నారు. ఈ మూడు పనులు చేయడానికి ముగ్గురు అవసరమున్నా ఒక్కరితోనే చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్త సేకరించే వాహనాలకు సరిపడినంత మంది కార్మికులు లేరని, వారికీ వార్డుల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులే సహకరించాల్సి వస్తోందన్నారు. వీటికితోడు చెత్త తీసుకెళ్లే తోపుడుబళ్లు, చెత్త బిన్‌లు, వారానికి సరిపడా పనిముట్లు సరఫరా సరిగా జరగడం లేదని చెప్పారు. పనిముట్లు లేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు మోహన్, శంకర్, గురుస్వామి, జనార్ధన్, బుజ్జీశ్వరావు, ఎ.రాము, జె.మాధవి, బి.సరోజిని తదితరులు పాల్గొన్నారు.

అమలుకేదీ గ్యారంటీ?

తట్టా బుట్టా సర్దుకుని వేలాది మంది నేటికీ ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోతున్న పరిస్థితులను మనం చూస్తున్నాం. ఇవికాకుండా శ్రీకాకుళం నగరాన్ని పారిశ్రామిక నగరంగా తీర్చిదిద్దడం, ఎలక్ట్రానిక్, హార్డ్‌వేర్ ఫుడ్‌పార్కు ఏర్పాటు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ ఏర్పాటు, జిల్లాలో సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు ఇలా చెప్పుకుంటూ పోతే హామీల జాబితా చాంతాడు మాదిరిగా ఉంటుంది. వీటిలో ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదు. దీంతో పలాస పర్యటనలో ఇచ్చిన జీడి పంటకు మద్దతు ధర అమలుపై సహజంగానే అందరిలోనూ సందేహాలు ఉంటాయి.

జీడి మద్దతు ధర విషయానికి వస్తే టిడిపి ఏనాడూ రైతుల పక్షాన నిలవలేదు. మరోవైపు అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం రైతులను అడుగడుగునా వంచించింది. జీడిపిక్కల 80 కేజీల బస్తాకు వ్యాపారులు రూ.తొమ్మిది వేలు, ప్రభుత్వం రూ.వెయ్యి ఇస్తుందంటూ మూడేళ్ల కిందట పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు స్వయంగా ప్రకటించారు. ఇప్పటివరకు ఆ డబ్బులూ ఇవ్వలేదు. రైతులతో అనేకసార్లు చర్చలు జరిపిన మంత్రి అప్పలరాజు, వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరించారు తప్ప రైతులకు మేలు చేసే ప్రయత్నం చేయలేదు. రైతుల ఆందోళనలు ఉధృతం కావడంతో జీడి పిక్కలకు మద్దతు ధరపై ప్రభుత్వం ఆలోచన చేస్తోందని, త్వరలోనే ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరిస్తుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ సైతం ప్రకటించారు. గతేడాది డిసెంబరులో పలాస పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జీడిపిక్కలకు మద్దతు ధరపై ఆలోచన చేసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినా నేటికీ నెరవేరలేదు.

జీడి రైతులకు మద్దతు ధర దక్కకపోవడంలో బిజెపి పాపమూ లేకపోలేదు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విదేశీ పిక్కల దిగుమతులపై సుంకాన్ని ఐదు శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించింది. దీంతోపాటు ఎస్‌ఇజెడ్‌లకు మరింత స్వేచ్ఛగా దిగుమతులకు అవకాశం కల్పించింది. దీంతో దేశీయ జీడి రైతులు నష్టపోతున్నారు. పైగా అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, జీడి పంటకు మాత్రం ప్రకటించలేదు. జీడి రైతులకు నష్టం చేసే విధానాలను అమలు చేస్తున్న బిజెపితో కలిసి టిడిపి ఎన్నికల్లో పోటీ చేస్తోంది. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకుంటామని టిడిపి హామీ ఇవ్వడం చూస్తుంటే, ఈ రెండు అంశాలు పరస్పరం విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు గుప్పించే హామీలపై రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు, పరిసరాలు, ప్రధాన మార్గాలను పరిశీలించి భద్రతాపరంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక పోలీసులు, కేంద్ర పోలీసు బలగాలు సమన్వయంతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద పహారా చేస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక అధికారులు స్ట్రాంగ్‌రూమ్‌లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇవిఎంల డిపాజిట్ సమయంలో ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆమె వెంట ఎఎస్‌పి జి.ప్రేమ్ కాజల్ ఉన్నారు.

ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు

సమయపాలనతో గరిష్ట కూలి

కోటబొమ్మాళి : సమయపాలన పాటించడం ద్వారా కూలీలు గరిష్ట కూలిని పొందవచ్చని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం, పొడుగుపాడు పంచాయతీల పరిధిలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ ఉపాధి హామీ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు వరం వంటిదన్నారు. ఇక్కడ కూలీలే యజమానులని, వారి అభీష్టం మేరకే పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రెండు పూటలా కనీసం ఆరు గంటల పాటు పనిచేయాలన్నారు. గరిష్ట కూలి పొందేందుకు అవసరమైన సాంకేతిక సలహాలను సిబ్బందిని అడిగి తెలుసుకోవాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉదయం ఆరు నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పనులు చేయాలన్నారు. ప్రభుత్వం కల్పించిన వంద రోజుల పనిదినాలను జాబ్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి హామీ అమల్లోకొచ్చాక జిల్లాలో వలసలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ జి.హరిప్రసాద్, ఇసి టి.రాంబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE IVth ADDL DISTRICT JUDGE (SC&ST) SRIKAKULAM AS.NO 67/2019

Between: **P. Gurumurthy and Others** ...Appellants
And: **M. Akkamma (Died) & others** ...Respondents

To,
R-2: Muddada Rajagopala Rao, S/o Pentayya, 52 years, Rtd Army, Davadavalasa, Amadalavalasa Mandal, Srikakulam District.
R-3:Muddada Venkata Govind Hemanth Prudiviraj, S/o, Rajagopla Rao, --Rest Do--
R-4: Muddada Chamundeswararao, S/o Rajagopala Rao, ---Rest Do--

NOTICE

Take notice the above appellants presented this appeal against respondents No.s 2to4 off you before the Honourable court and the Honourable court posted the matter on 08-05-2024 for your apperance, Hence you are advise to appear on **08-05-2024 at 10.30 AM.,** before the Honourable court either in person of through advocate failining which the court will be decided the appeal exparte in your absence.

(By order of the Honourable Court)

D. PARDHA SARADHI
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9440417374

IN THE HONOURABLE COURT OF THE IVth ADDL DISTRICT JUDGE (SC&ST) SRIKAKULAM IA. 227/2019 in AS.NO 67/2019

Between: **P. Gurumurthy and Others** ...Petitioners/Appellants
And: **M. Akkamma (Died) & others** ...Respondent/Respondents

To,
R-2: Muddada Rajagopala Rao, S/o Pentayya, 52 years, Rtd Army, Davadavalasa, Amadalavalasa Mandal, Srikakulam District.
R-3:Muddada Venkata Govind Hemanth Prudiviraj, S/o, Rajagopla Rao, --Rest Do--
R-4: Muddada Chamundeswararao, S/o Rajagopala Rao, ---Rest Do--

NOTICE

Take notice the above Petitioners presented this appeal against respondents No.s 2to4 off you before the Honourable court and the Honourable court posted the matter on 08-05-2024 for your apperance, Hence you are advise to appear on **08-05-2024 at 10.30 AM.,** before the Honourable court either in person of through advocate failining which the court will be decided the appeal exparte in your absence.

(By order of the Honourable Court)

D. PARDHA SARADHI
ADVOCATE,
SRIKAKULAM, CELL: 9440417374

అంతుచిక్కని చీడివలస సమస్య

- అధికారులు స్పందించడం లేదంటున్న గ్రామస్తులు
- వాతావరణంలో మార్పులే కారణమంటున్న అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని చీడివలస గ్రామంలో అంతు చిక్కని సమస్య నెలకొంది. గత వారం రోజులుగా తమ గ్రామంలో ఇంటిలో ఒకరు, ఇద్దరు జ్వరం, వాంతులు, ఒళ్ల నొప్పులు తదితర సమస్యలతో బాధపడుతున్నామని అయినా సంబంధిత అధికారులు పట్టించు కోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా మోటర్ ద్వారా గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీరు కలుషితం అవుతుందని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చీడివలసే గ్రామంలో ఆరోగ్య సమస్యలు తలెత్తు తున్నాయని, అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇఒపిఆర్‌డి విజయలక్ష్మిని వివరణ కోరగా గ్రామస్తులు తమకు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయడం జరిగిందన్నారు. అలాగే

శ్రీకాకుళంలో ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్ద కృష్ణయ్య

పైప్‌లైన్లు కూడా మరమ్మతులు చేయించామని, ఇంకా ఏమైనా సమస్యలుంటే పరిష్కరిస్తామన్నారు. ఇదే విషయాన్ని గుత్తావల్లి వైద్యాధికారిని రోజా వద్ద ప్రస్తావించగా గ్రామంలో గత మూడు రోజులుగా ఇంటింటికి వెళ్లి జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధ పడుతున్న వారిని మలేరియా, డెంగ్యూ వంటి రక్తపరీక్షలు నిర్వహి ంచడం జరిగిందన్నారు. ముఖ్యంగా వాతావరణంలో వచ్చిన మార్పుల వలన, ఎండలు ఎక్కువగా ఉండటం వలన జ్వర లక్షణాలు కనిపిస్తున్నాయని అయితే ఎవరికి మలేరియా, డెంగ్యూ వంటివి లేవని తెలిపారు. మరో మూడు రోజులపాటు గ్రామంలో ఇంటింటా పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలో సరఫరా అవుతున్న నీటిని కూడా పరీక్షలు జరిపించమన్నారు. అందులో ఎటువంటి సమస్య లేదని నిర్ధారించారని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వడం జరిగిందన్నారు. ఏది ఏమైనా గ్రామంలో నెలకొన్న సమస్యను అధికారులు గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి క్షుణ్ణంగా సమస్యలను పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామ పెద్దలు చెప్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆస్పత్రిలో చికిత్స

గ్రామంలో అధికారులు, ప్రజలు భిన్న అభిప్రా యాలు వ్యక్తపరుస్తున్న నేపథ్యంలో ఇదే గ్రామానికి చెందిన పిల్ల పెద్ద కృష్ణయ్య అనే వ్యక్తి జ్వరం, ఒళ్లు నొప్పులు కారణం గా శ్రీకాకుళంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది తున్నారు.

మండపల్లి ఉప సర్పంచి మృతి

తేజయ్య యాదవ్ (ఫైల్)

ఇచ్ఛాపురం : మండలంలోని మండపల్లి పంచాయతీ బుడ్డెపుపేటకి చెందిన వైసిపి నాయకులు, ఉప సర్పంచ్ నర్తు తేజయ్య యాదవ్ శనివారం ఆకస్మికంగా మృతి చెందారు. నిరంతరం పార్టీ కోసం శ్రమించి, నీతి నిజాయితీగా పనిచేసిన తేజయ్యయాదవ్ మృతి తీరని లోటంటూ సర్పంచ్ పిట్ట శేషిరేక, ప్రతినిధి పిట్టా మామయ్య సంతాపం వ్యక్తం చేశారు. తేజయ్య మృతికి ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, జెసిఎస్ కన్వీనర్ చిట్టిబాబు, పురుషోత్తంరెడ్డి, కె.మోహనరావు పాల్గొన్నారు.

బిఎస్‌పిలోకి శ్రీనివాసరావు

నందిగాం : వైసిపిని వీడి బిఎస్‌పిలోకి చేరుతున్న మండలంలోని దేవలభద్ర సర్పంచ్ ప్రతినిధి చింతాడ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. ఈ మేరకు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.నారాయణరావు ఆధ్వర్యాన టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు ప్రకటించారు. గతంలో ఎస్‌సిలకు 26 రకాల పథకాలు ఉంటే... వాటిని వైసిపి ప్రభుత్వం తొలగించిందని, దీనివల్ల దళితులంతా నష్టపోయారని అన్నారు.

స్వతంత్ర అభ్యర్థి చక్రవర్తి నామినేషన్

ఇచ్ఛాపురం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా సుగ్గు చక్రవర్తి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. లొద్దపుట్టికి చెందిన చక్రవర్తి తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సురదర్‌దొరకు అందజేశారు. ఇప్పటి వరకు రెండు నామినేషన్ దాలయ్యాయి.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి దేవి

కవిటి : ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులు

వైసిపితోనే అభివృద్ధి సాధ్యం

ప్రజాశక్తి- కవిటి

ఐదేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత వైసిపిదని ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ తెలిపారు. మండలంలోని పెద్దకర్రివానిపాలెంలో వైసిపి నాయకులతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కర్రి గోపయ్య, యలమంచి నీలయ్య, ఎన్ని అశోక్, కాయ భీమసేన్, ఎస్.పి.నారాయణస్వామి, ఎస్.పి.ప్రవీణ్, శేఖర్, సనపల శ్రీను పాల్గొన్నారు.

పోలాకి : మండలంలోని గుప్పిడిపేటలో వైసిపి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌కు మద్దతుగా జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణదాస్, ధర్మాన రామలింగంనాయుడులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కృష్ణదాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ఆరంగి మురళీధర్, ముద్దాడ భైరాగినాయుడు, జెడ్‌పిటిసి చింతు రామారావు, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన దాలినాయుడు, పొందర కార్పొరేషన్ చైర్మన్ రాజాపు అప్పన్న పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని పాలవలసకు చెందిన 15 కుటుంబాలు వైసిపిలో చేరారు.శనివారం పాలవలసలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. పార్టీలో చేరిన వారికి చిరంజీవి నాగ్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి రానున్న ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కెవిజి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సురవరపు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చిరంజీవి నాగ్

అగ్నిమాపక వారోత్సవాల ముగింపు

ప్రజాశక్తి- రణస్థలం

అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా శనివారం అగ్నిమాపక కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరెంటెండెంట్ డాక్టర్ పి.లలిత, సిబ్బంది, డ్వాక్రా మహిళలు, పరిసర ప్రాంతాల్లో గల మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి పైల అశోక్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు చేపట్టే చర్యలు, ఆపదలో ఉన్నవారిని రక్షించే విధానం, అధునాతన అగ్నిమాపక పరికరాలను ప్రదర్శించి వివరించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువగా అవకాశాలు ఉంటాయని, జాగ్రత్తలు పాటించడం ద్వారా నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, జరిగిన వెంటనే స్థానిక

రణస్థలం : మాట్లాడుతున్న అగ్నిమాపకశాఖ అధికారి అశోక్

అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించాలని కాశీబుగ్గ అగ్నిమాపక కేంద్ర ఎస్ఐ బి.సోమేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎం.రమేష్‌నాయుడు, పి.శ్రీనివాజరావు, టి.జనార్దనరావు పి.మన్మథరావు, కె.సంతోష్‌కుమార్, వి.రాము, ఎన్.చిరంజీవిలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : శంకర్‌కు కేకును తినిపిస్తున్న నాయకులు

చంద్రబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో చంద్రబాబును తిరిగి సిఎంను చేయడమే లక్ష్యమని, అందుకు ప్రతి కార్యకర్త శ్రమించాలని టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ పిలుపునిచ్చారు. శనివారం చంద్రబాబు జన్మదిన వేడుకలను జిల్లా పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు, దివంగత నేత ఎన్‌టిఆర్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తూ పార్టీ లక్ష్యాలను చేరుకునేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి స్ఫూర్తి దాయకమన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, అధికార ప్రతినిధి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు, కవ్వాడి సుశీల, సీపాన రమ, కొర్ను ప్రతాప్, సుధాకర్ పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు లొడగల కామేశ్వరరావు ఆధ్వర్యాన జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్ త్యాడి, ఎన్.శ్రీనివాస్, కొత్త సత్యంలు పాల్గొన్నారు. అలాటే టిడిపి సమన్వయకర్త వెంకన్న చౌదరి కూడా కట్ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, దువ్వాడ హేంబాబుచౌదరి, దువ్వాడ శ్రీకాంత్, దానేటి పద్మజ, దువ్వాడ సంతోష్‌కుమార్ నాయుడు పైల చక్రధర్ పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికావద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దేవి అన్నారు. పిహెచ్‌సి ఆవరణలో ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సందర్భంలో బయటకు రావద్దని సూచించారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వేడిగాలులు వీస్తాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పనిసరి పరిస్థితిలో రావాల్సి ఉంటే గొడుగు, టోపీ, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలన్నారు. డీ హైడ్రేషన్ అవ్వకుండా ఒఆర్‌ఎస్ పాకెట్లు, మజ్జిగ, చల్లని నీరు, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవాలన్నారు. వైద్యాధికారి అంజలి, జిల్లా మాస్ మీడియా ఎడ్యుకేషన్ అధికారి పైడి వెంకటరమణ, వెంకట్రావు, అనురాధ, ఫార్మసీ ఆఫీసర్స్ బోనేల గోపాల్, లీల పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- ఆమదాలవలస

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆధ్వర్యంలో వైసిపికి చెందిన 120 కుటుంబాలు శనివారం టిడిపిలో చేరారు. మండలంలోని మునగవలసకు చెందిన వ్యాపారవేత్త బగాది రామినాయుడు తన అనుచరులు 60 కుటుంబాలతో కలిసి రవికుమార్ సమక్షంలో టిడిపి కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి విధి విధానాలు నచ్చి పార్టీలో చేరామన్నారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మరో 34 కుటుంబాలు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు సమక్షంలో జనసేనలో చేరారు. అలాగే మండలంలోని దూసి పంచాయతీ టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కంచరాన లోకేశ్వరరావు ఆధ్వర్యంలో దూసి

పార్టీలో చేరిన వారితో రవికుమార్

మాజీ ఉప సర్పంచ్, ప్రస్తుత 8వ వార్డు మెంబర్ చిట్టి వెంకటరావుతో పాటు 30 కుటుంబాలు చీమలవలసలో రవికుమార్ సమక్షంలో చేరారు. కార్యక్రమంలో పేడాడ సూరపునాయుడు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, పైడి మురళీమోహన్, టిడిపి నాయకులు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని చంద్రశేఖర్, గొర్లె సూర్యం, అప్పన్న, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఓట్లు అడిగే అర్హత మంత్రికి లేదు

పలాస: పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తాను రైల్వే ఫ్లైఓవరు పూర్తి చేసి ఎన్నికలకు వస్తామని చెప్పి ఆ వంతెన నిర్మాణం పూర్తి చేయకుండా చినబాడాం ప్రాంతం ఎలా ప్రచారం చేపడతారని, ఓట్లు అడిగే అర్హత ఆయనకు లేదని టిడిపి పట్టణ అధ్యక్షులు బడ్డ నాగరాజు అన్నారు. చినబాడాంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్వీర్యమైందని, గత టిడిపి ప్రభుత్వంలో అట్టాడ కోనేరు, నయానోర్ కోనేరు, శ్మశాన వాటికకు రోడ్డు తదితర అభివృద్ధి పనులు చేశామన్నారు. మంత్రి హయాంలో వంశధార శివారు భూములకు నీరు అందించలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. చినబాడాం ప్రాంతానికి వైసిపి ప్రభుత్వం అభివృద్ధి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పలరాజుకు ఈ ప్రాంతంలో ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. సమావేశంలో పి.మన్మథరావు, పి.రవికుమార్, కె.చిన్నారావు, బి.ధర్మారావు, ఎం.శంకరరావులు పాల్గొన్నారు.

బావా...! ఏంటీ గోల!!

గ్రామీణ ప్రాంతాల్లో జోరుగా రచ్చబండ చర్చలు

ప్రజాశక్తి - టెక్కలి

సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాల వద్ద చర్చలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం వేసవి తీవ్రత దృష్ట్యా ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో సాయంత్రం వేళ గ్రామ పొలిమేరల్లో గాలి కోసం వెళుతుండడంతో చర్చలు జోరెక్కుతున్నాయి. మరి కొద్ది రోజుల్లో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పార్టీల ప్రచార వాహనాలు కూడా జోరెక్కాయి. సరదాగా కుచ్చు టప్పాలు కొట్టుకుంటూ సాగుతున్న ఈ సంభాషణ. ఈ నేపథ్యంలో జరుగుతున్న చర్చ సరదాగా మన యాసలో.. మీకోసం..

బావ: బామ్మర్ది మళ్లీ ఏంటీ పార్టీల గోల ఇనబడుతుంది

బామ్మర్ది : అదేలేరా బావ మళ్లీ ఎలచ్చన్లు వస్తున్నాయి కదా! అదీ సంగతి

బావ : ఏటి సెప్పమంటావు బావ అందరూ పోటీసేస్తున్నారు

బామ్మర్ది : అదే బావ కాంగ్రెసోళ్లు, వైసిపిలోలు, తెలుగుదేశం లోళ్లు అందరూ

బావ : మరి సిపిఎం, బిజెపి, జనసేన వాళ్లు పోటీ చేయడం లేదా?

బామ్మర్ది : ఆలూ సేత్తాన్నురా... అయితే ఈసారి బిజెపి, జనసేన, చంద్రబాబునాయుడు, కలిసిపోనారు కదా అందుకే. ఎర్రజెండా పార్టీ సిపిఎం లోళ్లు కాంగ్రెస్‌తో కలిసి వెళ్తున్నారు

బావ : ఇదేమి సిత్రం బామ్మర్ధి నువ్వు సెప్పినట్లు వింటే ఎవ్వరూ సొంతంగా పోటీ సెయ్యడం లేదా? ఏంటీ

బామ్మర్ది : నేదేహేహే ఒక్క జగన్‌బాబు ఒక్కడే పోటీ సేత్తాన్నాడు.

బావ : బామ్మర్ధి అయితే మనయూల్లో ఎలాగుంటాది ఏటీ.

బామ్మర్ది : ఎనాగుంటాది ఏటీ నువ్వు ఎటీ ఎలచ్చన్లు కోసం మాటాడమాకు. ఎవ్వడికంటే అడికే కోపం వచ్చేస్తుంది. నువ్వు నోరు మూసుకోనియుండు.

బావ : అదేటీ బామ్మర్ధి మాట్లాడవద్దు అంటావేటీ స్వతంత్రం లేదా ఏటీ.

బామ్మర్ది : స్వతంత్రమా పాడా ఈ ప్రభుత్వంలో మాటాడితే ఒట్టు కేసులే పెడుతున్నారు. ఆందుకే పల్లకోని యుండు.

బావ : మనయూరు అలాగే యుంది ఏమీ మారలేదు

బామ్మర్ది : ఏటి మారేది? ఇంకా ఇలాగైనా యుంది సంతోసించు. మెన్ననే ఎలచ్చన్లు వస్తున్నాయని రోడ్లు కప్పినారు.

బావ : ఏమాటకి ఆమాట సెప్పుకోవాలి బామ్మర్ది హైదరాబాదులో కాంగ్రెస్ వచ్చింది. మళ్లీ ఇక్కడ కూడా వస్తే బాగున్ను.

బామ్మర్ది : నీకు ఎంత సెప్పినా ఇనవా ఎటీ ఎలచ్చన్లు కోసం మాట్లాడవద్దు అని సెప్పినానా లేదా?

బావ : అనాగే బావ సీకటి పడతున్నాది మళ్లీ రేపు కలుద్దాంలే.

ఓటు అడిగే హక్కు వైసిపికి లేదు

శ్రీకాకుళం అర్బన్ : ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు వైసిపి నేతలకు లేదని టిడిపి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని మంగువారితోట, మొండేటి వీధి పరిసరాల్లో శనివారం సూపర్ సిక్స్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి తుపాకుల రవికుమార్, ఎస్‌సి సెల్ నగర అధ్యక్షుడు దానం పూర్ణచంద్రరావు, జి.లక్ష్మి, లావణ్య తదితరులు డివిజన్ ఇన్‌ఛార్జి రోణంకి కళ్యాణ్ ఆధ్వర్యాన టిడిపిలో చేరారు. వారికి శంకర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కంచ్రవీధి, కామాక్షమ్మ నగర్, ప్రాంతాల్లో ఇంటింటా ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంధవరపు శ్రీను, డివిజన్ నాయకులు నిజముద్దీన్, జ్యోతిష్, రఫీ, సాయిలక్ష్మి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న శంకర్

సార్వత్రిక సంగ్రామం

ప్రజా నాయకుడు... వెంకటేశ్వర శర్మ



వెంకటేశ్వర శర్మ హయాంలో రూపుదిద్దుకున్న గొనామరి గెడ్డ (ఇన్‌సెట్‌లో వెంకటేశ్వర శర్మ)

- అప్పట్లోనే నదీ జలాల ఒప్పందం
- సాగునీరు, తాగునీరుకు ప్రాధాన్యం
- మౌలిక వసతుల కల్పనలో అందెవేసిన చేయి

ప్రజాశక్తి - కవిటి

వంశధార, బహుద జలాల అనుసంధానంతోనే ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతుల జీవితాలు ఆధారపడి ఉన్నాయని, ఎట్టి పరిస్థితుల్లోనూ దాన్ని సాధించి తీరుతామని వంశధార జలసాధన కమిటీ పేరుతో ఇటీవల నియోజకవర్గ వ్యాప్తంగా పలు సమావేశాలు నిర్వహించడం జరిగింది, ఇంకా జరుగుతోంది. కానీ, నాలుగు దశాబ్దాల కిందటే ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసనసభ్యుడిగా వ్యవహరించిన బెందాళం వెంకటేశ్వరశర్మ అప్పట్లోనే ఒడిశాతో అంతర్రాష్ట్ర నదీ జలాల ఒప్పందం కుదుర్చుకోవడంలో కీలకపాత్ర పోషించారు. అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డిని ఒప్పించి ఒడిశా నుంచి వచ్చే బహుదా నది జలాల్లో 1.5 టిఎంసిల నీటిని జూన్ నుంచి సెప్టెంబరు వరకు ఇచ్ఛాపురం నియోజకవర్గ ప్రజలు ఉపయోగించుకునేలా ఒప్పందం కుదుర్చుకునేలా చేశారు. కానీ, ఆ తర్వాత నాయకులు దీనిపై పెద్దగా దృష్టి సారించకపోవడం, ప్రస్తుత కాలంలో రాజకీయ వ్యవస్థ రూపురేఖలు మారిపోవడం ప్రస్తుతం ఇచ్ఛాపురం రైతాంగం నీటి సమస్యను ఎదుర్కోవడంలో ప్రధాన కారణమని చెప్పొచ్చు.

తాగునీరు ఆయన చలువే...

నదీ జలాల ఒప్పందమే కాకుండా కవిటి మండలంలోని గ్రామాలన్నింటికీ తాగునీరు అందించే తాగునీటి పథకం కూడా ఆయన హయాంలోనే మంజూరైంది. అంతేకాకుండా ఉద్దానం రైతులకు భూమి శిస్తు రద్దు, కొబ్బరిపై పన్ను రద్దు వంటివి చేయించి రైతాంగానికి ఆయన ఎనలేని మేలు చేశారు. అదేవిధంగా కవిటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గొనామరి గడ్డ రూపకల్పన ఆయన కాలంలోనే జరిగాయి. ముఖ్యంగా తన స్వగ్రామమైన బొరివంకలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మాణానికి తన సొంత భూమి ఐదు ఎకరాలు విరాళంగా అందించిన ఉదాత్త స్వభావుడు వెంకటేశ్వరశర్మ. అంతేకాకుండా మండలంలో గ్రామీణ బ్యాంకు, కో-ఆపరేటివ్ బ్యాంకు, పశువైద్యశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు ఆయన కృషి చలవే.

నిరాడంబరతకు నిలువెత్తు రూపం

ప్రస్తుతం రాజకీయాలంటే దర్పం, అధికార దాహం, అణువణువు ఆడంబరాల నిలయం. కానీ, అప్పట్లో రాజకీయమంటే సమస్యలపై రాజీలేని పోరాటం. ఆపద అంటే చివరి వరకూ అండగా నిలిచే తత్వం. నాయకుడు అంటే నలుగురికీ దారి చూపేవాడు. వీటిని తు.చ. తప్పకుండా పాటించి నిరాడంబరమైన రాజకీయానికి నిలువెత్తు రూపంగా నిలిచారు వెంకటేశ్వర శర్మ. రాజకీయాల్లో గౌతు లచ్చన్న అనుచరునిగా పేరుగాంచిన వెంకటేశ్వర శర్మ కవిటి మండలం బొరివంకలో 1923లో జన్మించారు. తొలినాళ్లలో స్వతంత్ర పార్టీలో చురుకుగా పాల్గొన్న ఆయన 1952లో గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత ఇచ్ఛాపురం సమితి అధ్యక్షునిగా సేవలందించారు.

అనంతరం 1972లో స్వతంత్ర పార్టీ తరపున ఇచ్ఛాపురం నుంచి శాసనసభ్యునిగా పోటీ చేసినా విజయానికి ఆమడ దూరంలో నిలిచిపోయారు. అనంతరం గౌతులచ్చనతో కలిసి జనతా పార్టీలో చేరారు. ఆ తర్వాత 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి జనతా పార్టీ తరపున తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు. తన రాజకీయ జీవితంలో చెరువుల అభివృద్ధి, నీటిపారుదల సౌకర్యం, ప్రాథమిక విద్య, ఆరోగ్యం, సాగునీరు తాగునీటికి ఆయన అధిక ప్రాధాన్యత ఇచ్చారు. నిరాడంబరమైన రాజకీయ నాయకునిగా పేరుగాంచిన వెంకటేశ్వర శర్మ 1992లో తన స్వగ్రామంలో కన్నుమూశారు.

కనిపిస్తే... కండువేత!

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఇదో మైండ్ గేమ్.. నాయకుల్ని మానసికంగా ఇబ్బంది పెడుతూ ఓటర్లను అయోమయానికి గురిచేసే ఆట! ఇందుకు మీడియా, సోషల్ మీడియా ఆయుధాలు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు, ముఖ్య నాయకులు తమ కార్యక్రమాలు చిత్రీకరించేందుకు సొంతంగా కెమెరామెన్లను నియమించుకున్నారు. అనుచరగణం ఎలాగూ వెంటుంటారు. వీరు ప్రచారంలో నాయకుల వెంట తిరుగుతూ కొత్తకొత్త ఆలోచనలతో ఓటర్లను అయోమయంలో పడేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీల నుంచి నాయకులు తమ పార్టీలోకి చేరారంటూ భ్రమ కలిగిస్తూ ప్రచారం చేస్తున్నారు. తమ నాయకుడికి వద్దకు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎవరు వచ్చినా క్లిక్ మనిపించడం.. వివిధ సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి దాన్ని ప్రచారంలో ఉంచడం జరిగిపోతోంది..

ప్రలోభాలు.. బెదిరింపులు..

ఓటర్లకు, నాయకులకు బెదిరింపులు ఎక్కువయ్యాయి. కాస్త పలుకుబడి ఉండి.. నాలుగు ఓట్లు వేయించగలగిన వ్యక్తులను బెదిరించడం, ఫోన్లో ముందు మెత్తగా మాట్లాడి ఆతర్వాత బెదిరింపులకు దిగడం సోషల్ మీడియాలో ఆఫోన్ వాయిస్ చక్కర్లు కొట్టడం జరుగుతోంది. అభ్యర్థులకు సైతం ఈతలనొప్పి బొప్పికట్టిస్తోంది. ముందు ఎవరో ఫోన్లో మాట్లాడడం.. అదేదో సినిమా లాగా నీకేం తక్కువ చేశాను... అందరి కంటే బాగానే చూసుకుంటున్నా గదా అని మొదలు పెట్టి .. రానున్న రోజులు మావే.. మాదే అధికారం.. తర్వాత మట్టి కరిపిస్తామంటూ ఫోన్లోనే మాట్లాడిస్తున్నారు.. అదంతా రికార్డ్ చేసి ప్రత్యర్థులు తిరిగి సోషల్ మీడియాలో పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామాల్లో పట్టున్న వారిని నయానా భయానా లోబర్చుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఏకంగా కొందరైతే ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ప్రత్యర్థులను తిట్టి పోస్తున్నారు. గ్రామాల బాధ్యత మీకు అప్పగిస్తాం. ఎంత కావాలో చెప్పండి. ఏం కావాలో అడగండి. ఆ బూత్‌లలో మాకు మెజార్టీ రావాలంటే మేమేం చేయాలని కూడా డైరెక్టుగా అడిగేస్తున్నారు.

రాజకీయ పార్టీల నాయకులు విరివిగా సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆత్మీయ సమావేశాలు పేరిట సాగుతున్న ఈ కూటముల్లో తటస్థులతో ప్రమాణాలు చేయించుకొని ఈ సారికి తమకు అనుకూలంగా పనిచేయాలని ఏం కావాలో తాము చూసుకుంటామని మాటిస్తున్నారు. సంఘ నాయకులతో విడివిడిగా మాట్లాడి వారి పరిధిలో ఉన్న ఓట్ల సంఖ్యను బట్టి బేరాలాడుతున్నారు. కుల, ఉద్యోగ, కార్మిక, వ్యాపార సంఘాల నాయకులతో ఈ రహస్య సమావేశాలు జోరందుకున్నాయి. ఆత్మీయ సమ్మేళం పేరుతో హోటళ్లలో విందు భోజనం ఏర్పాటు చేసి నజరానాలు ప్రకటిస్తున్నారు. ఈసమావేశాల్లో నేరుగా అభ్యర్థులే హాజరై తమకేమి కావాలో చెపుతూ మేమి చేయాలో చెప్పండని అడుగుతున్నారు. గడువు సమీపిస్తుండడంతో అన్ని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో హోరాహోరీగా సాగుతున్న ప్రచారం జోరందుకున్నాయి.

నేర చరిత్ర దాస్తే దాగదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్ల పర్వం కీలకం. ఈ సమయంలో తమ నేర చరితను దాచే పరిస్థితి లేదు. కేసులు, శిక్ష కాలం అన్ని వివరాలు బహిరంగపరచాలని ఎన్నికల సంఘం నిబంధన విధించింది. దీనికి తోడు అభ్యర్థులు, పార్టీలు నేర చరితపై విధిగా ప్రకటనలు ఇవ్వాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ మేరకు 2018 సెప్టెంబరు 25న దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. నేర చరిత ఉంటే ఆ వివరాలను ఫారం-2బి భాగం 3ఎ, 26 అఫిడవిట్లతో పాటు ప్రత్యేకంగా సి1, సి2 ఫారాల్లో తెలియపర్చాల్సి ఉంటుంది. ఎన్నికల సంఘం వీటి నమూనా ఫారాలను అభ్యర్థులకు అందజేస్తోంది. ఒకసారి వీటిని లోతుగా పరిశీలిస్తే..

సి1: నేర చరితను తెలిపే ఫారం. - సి2: అభ్యర్థి నేర చరితను ధ్రువీకరిస్తూ రాజకీయ పార్టీ పూర్తి చేయాల్సిన ఫారం. అభ్యర్థి, పార్టీ విడివిడిగా సి1, సి2, ఫారాల ప్రకారం మూడు సార్లు ప్రధాన పత్రికల్లో నేర చరితపై ప్రకటన ఇవ్వాల్సి ఉంటుంది. - ఫారం2 (బి): అభ్యర్థి నామినేషన్ వేసేందుకు ఫారం 2 (బి) పత్రాలను పూరించాలి. నామినేషన్ పత్రంతో పాటు అభ్యర్థి ఫారం 26 (అఫిడవిట్) పత్రాలను సమర్పించాలి. ఫారం 26లో అభ్యర్థి పూర్తి వివరాలు, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా, ఆస్తులు, అప్పుల వివరాలతో పాటు నేర చరిత వివరాలను తప్పకుండా పొందుపరచాలి.

తేడా వస్తే... తిరస్కరణే..

నామినేషన్ పత్రాలను పూర్తి చేయడంలో ఏమాత్రం తేడా వచ్చినా తిరస్కరణకు గురైన ఉదంతాలు అనేకం. బల ప్రదర్శన, ర్యాలీల హడావుడిలో పడి అసంపూర్తిగా పూరిస్తే చివరి నిమిషంలో బోల్తా పడే అవకాశాల్లోన్నో ఉన్నాయి. నామినేషన్ వేసిన అనంతరం ఎన్నికల అధికారులు అభ్యంతరాలపై నోటీసు జారీ చేస్తారు. వాటికి స్పందించి మళ్లీ కొత్త నామినేషన్ అందించాల్సి ఉంటుంది. స్పందించని పక్షంలో తిరస్కరణకు గురవుతుంది.

మీకు తెలుసా?

ఇచ్ఛాపురం : రాష్ట్రం మొట్టమొదటి నియోజకవర్గం ఇచ్ఛాపురం. ఈ నియోజకవర్గంలో రాష్ట్రంలో ఎక్కడా లేనిటివంటి తీర ప్రాంతం ఉంది. మండలంలోని డొంకూరు-పెద్దలక్ష్మీపురం నుంచి ప్రారంభమై సోంపేట మండలంలో ఎర్రముక్కం వరకు తీర ప్రాంతం ఉంది. దాదాపు 38 కిలో మీటర్ల దూరం వరకు ఉండడం విశేషం. ఇంత సుదూరు తీరప్రాంతం ఎక్కడా లేదు. నాలుగు దశాబ్దాల పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మండలం, మున్సిపాలిటీ, కవిటి, కంచిలి మండలాలు మాత్రమే ఉండేవి. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనతో పక్కనే ఉన్న సోంపేట నియోజకవర్గం కనుమరుగైంది. సోంపేట మండలాన్ని ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కలిపారు. నాటి నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సోంపేట మండలం చేరింది. దీంతో మున్సిపాలిటీతో పాటు ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలతో నియోజకవర్గం ఏర్పాటైంది.

అవినీతి లేని పాలన అందిస్తా

ప్రజాశక్తి - ఆమదాలవలస

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే అవినీతి లేని పాలన అందించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని స్వతంత్ర అభ్యర్థి సువ్వారి గాంధీ తెలిపారు. శనివారం పురపాలక సంఘంలోని 3, 5 వార్డుల పరిధిలోని ఊసవానిపేట, అక్కివలస, సొట్టవానిపేటలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి అధికార విపక్ష పార్టీల అభ్యర్థులకు ఓటు వేస్తే అవినీతి కుటుంబ పాలనకు మద్దతిచ్చినట్లేనని ఓటర్లకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అన్నెపు సూరిబాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 కుటుంబాలు చేరిక

పురపాలక సంఘం పరిధిలో 5వ వార్డు పంతులు పేటకు చెందిన వైసిపి, టిడిపి నుంచి చెంచాల యర్రయ్య, సడగాన అప్పారావు, గొద్దు అప్పారావు, బట్న రాజారావులకు చెందిన 30 కుటుంబాలు గాంధీ సమక్షంలో చేరి ఆయనకు మద్దతు ప్రకటించారు.

పంతులుపేటలో పార్టీలో చేరిన వారితో గాంధీ

రవికుమార్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పాలనాదక్షత చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని చీమలవలస, చీమలవలస కాలనీలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల పోస్టర్లను పంపిణీ చేసి ప్రజలకు పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలనకు చరమగీతం పాడి టిడిపిని అధికారంలోకి తీసుకురావడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గడచిన ఐదేళ్ల కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లోనూ విఫలమైందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం టిడిపితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పేడాడ రామ్మోహనరావు, సూరపునాయుడు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, టిడిపి నాయకులు నూక రాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని సుజాత, చంద్రశేఖర్, సర్పంచ్‌లు గురుగుబెల్లి చెల్లం నాయుడు, చేపేన సత్తిరాజు, గొండు రమణ, అన్నెపు భాస్కరరావు, బత్తుల బుజ్జి, హనుమంతు బాలకృష్ణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఇంటింటా ప్రచారంలో మహిళలతో రవికుమార్

మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

వైసిపికి మరో అవకాశం ఇవ్వాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

చంద్రబాబు చేసిన తప్పులను అసెంబ్లీలో ప్రశ్నించి బాధ్యతాయుతంగా వ్యవహరించానని, విశాఖ రాజధాని వద్దన్నందుకు ఆయన వైఖరిని ప్రజలకు తెలియ జెప్పడంలోను తనవంతు పాత్ర పోషించానని రెవిన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శుక్రవారం రాత్రి నగరంలోని ప్రైవేట్ హోటల్‌లో విశ్రాంత ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో తిరిగి శ్రీకాకుళం నుంచి తనను గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ త్రిపురాన వెంకటరత్నం, విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఊడి శ్యామ్, శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డీపీ దేవ్, కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, పోలుమహంతి ఉమామహేశ్వరావు, సురంగి మోహనరావు పాల్గొన్నారు.

ఎదురుగాలిలో...

ఒకే ఒక్కడు!

15 రోజుల్లోనే ఎమ్మెల్యేగా సాయిరాజ్ ఎన్నిక

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

సాధారణంగా గ్రామస్థాయి నాయకుడిగా ఎదగాలంటే సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజలతో మమేకమవ్వాలి. కానీ, ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి 2009లో టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగిన పిరియా సాయిరాజ్ 15 రోజుల వ్యవధిలోనే ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పటివరకూ ఆయన స్థానికంగా ఎవరికీ తెలియదు. కీర్తిశేషులు కింజరాపు ఎర్రన్నాయుడి ప్రోత్సాహంతో టిడిపి టిక్కెట్ దక్కించుకున్నారు. అప్పట్లో జిల్లాలోని పది నియోజకవర్గాలకు గాను తొమ్మిది స్థానాల్లో కాంగ్రెస్ గెలుపొందగా.. ఇచ్ఛాపురం నుంచి సాయిరాజ్ మాత్రమే టిడిపి తరుపున విజేతగా నిలిచారు. చివరకు ఎంపీగా ఎర్రన్నాయుడు ఓటమి చవిచూసినా సంస్థాగత బలంతో సాయిరాజ్ గెలుపొందడం విశేషం. ఇప్పటికీ టిడిపి బలాన్ని చెప్పుకోవడానికి సాయిరాజ్ ఎన్నికను ఉదాహరణంగా చెబుతారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

విద్యార్థిని అభినందిస్తున్న బాలాజీ, అధ్యాపకులు

విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో 2018వ బ్యాచ్ విద్యార్థిని శ్వేత బాయ్ సినోప్సిస్ కంపెనీలో ఏడాదికి రూ.19 లక్షల ప్యాకేజీతో ఎంపికైన సందర్భంగా ఆచార్య కొక్కిరాల వెంకట గోపాల ధనబాలాజీ అభినందించారు. బాగా చదువుకొని ఇటువంటి ఉన్నత ఉద్యోగాలు పొంది యూనివర్సిటీకి, మీ ప్రాంతానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, డీన్ అకడమిక్స్ మోహన్ కృష్ణ చౌదరి, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ రవి, ఫైనాన్స్ ఆఫీసర్ డా. అసిరి నాయుడు శ్వేతను అభినందించి సత్కరించారు.

మాట్లాడుతున్న జయరాం

పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి- బూర్జ

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌పై దువ్వాడ శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి, తూర్పు కాపు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్ల జయరాం హెచ్చరించారు. శనివారం మండలంలోని కొల్లివలస పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఎవరైనా వ్యక్తిగత దూషనలు మాను కోవాలన్నారు. లేదంటే తగిన బుద్ధి చెప్పి తీరుతామని హెచ్చరించారు. ఒక ఎమ్మెల్సీగా ఉండి వీధిరౌడీలా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించబోమన్నారు. ఆయనతో పాటు బిజెపి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు నామినేషన్లు దాఖలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం భారత చైతన్య యువజన పార్టీ తరపున శాసనసభ అభ్యర్థిగా బూర్జ మండలం తోటాడ గ్రామానికి చెందిన చేపేన శ్రీనివాసరావు, అలాగే జై భారత్ నేషనల్ పార్టీ తరపున శాసనసభ అభ్యర్థిగా బూర్జ మండలం నీలా దేవిపురంకు చెందిన బురిడి గౌరీ శంకర్ తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు సమర్పించారు.

జై భారత్ పార్టీ అభ్యర్థి నామినేషన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో జైభారత్ పార్టీ శ్రీకాకుళం ఎమ్మెల్యే అభ్యర్థిగా రాగోలు నాగశివ నామినేషన్‌ను దాఖలు చేశారు. శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆర్‌డిఒ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సిహెచ్ రంగయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

రెడ్‌క్రాస్ బృందం సాయం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం- రాజాం రోడ్డులో జి.సిగడం మండలం గేదెలపేటకు చెందిన బి.ధర్మారావు నడుపుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. పక్కనే ఉన్న పొదల్లోకి దొర్లుకొని పడిపోవటంతో తలకు, కాళ్లకు గాయాల పాలయ్యాడు. ఆయనతో పాటు పలువురు క్షతగాత్రులను రెడ్‌క్రాస్ ప్రతినిధులు హుటాహుటిన ప్రమాద స్థలంలో ప్రథమ చికిత్స అందించి అక్కడి నుంచి రాజాం ప్రభుత్వ ఆస్పత్రికి అంబులెన్సులో తరలించారు.

వైద్యం అందజేస్తున్న సిబ్బంది

'సూపర్ సిక్స్'పై ప్రచారం

బూర్జ : ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బాణంలో శంఖారావం కార్యక్రమంలో భాగంగా అమదాలవలస టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల శనివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి రవికుమార్‌ను, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడును గెలిపించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు ఎలకల రమణ, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడన శేషగిరి నాయుడు, టిఎన్ టియుసి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణరావు, బలగ శంకర్ భాస్కరరావు, కింజరాపు రమణ, నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణ పరిధిలో 14వ వార్డు పరిధి ఐజె నాయుడు కాలనీలో తెలుగు యువత నాయకుడు కూన రాము ఆధ్వర్యంలో మాజీ ఎంపిపి కూన ప్రమీల సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ తమ్మినేని గీతాసాగర్, కూన అప్పలనాయుడు, కణితి

పొందూరు : పోస్టర్‌ను అందజేస్తున్న ప్రమీల, నాయకులు

విజయలక్ష్మి, గుడ్ల రాజ్యలక్ష్మి, పాతిన గడ్డెయ్య, మాజీ కౌన్సిలర్ కూన చిన్నమ్మడు, కనకరాజు బగానా అమ్మినాయుడు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలోని గంగంపేటలో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ నాయకులు ఆనెపు రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, ప్రభాకరరావు, పైడి సత్యప్రసాద్, జనసేన, బి.ఎపి నాయకులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

విశాఖపట్నం జోనల్ హెడ్ షాలినీ మీనన్

బ్యాంకు నూతన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న షాలినీ మీనన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే యూనియన్ బ్యాంక్ ప్రధాన లక్ష్యమని విశాఖపట్నం జోనల్ హెడ్ షాలినీ మీనన్ అన్నారు. నగరంలోని పెదపాడు రోడ్డులో రామిగడ్డ సమీపంలో మార్చిన రామలక్ష్మణ బ్రాంచిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్యాంకు ద్వారా 17 ఏళ్లుగా ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు వివరించారు. రూ.120 కోట్లతో బ్యాంకు లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలో యూనియన్ బ్యాంక్ లీడ్ బ్యాంకుగా ఉంటూ రూ.7, 500 కోట్ల లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలో 40 బ్రాంచ్‌ల ద్వారా వినియోగదారులకు సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. గహ, వ్యవసాయ తదితర రుణాలను అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎటిఎంను ప్రారంభించారు. ప్రతి ఒక్కరు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం డిప్యూటీ జోనల్ హెడ్ హోంరామ్, శ్రీకాకుళం రీజనల్ హెడ్ వెంకట తిలక్, బ్రాంచ్ మేనేజర్ ఇందిరా ప్రియదర్శిని, ఆఫీసర్ సంఘ నాయకులు తేజేశ్వరరావు, అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీని వాసులు, బ్రాంచ్ మేనేజర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

మాట్లాడుతున్న రంజిత్‌కుమార్

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు సాంకేతిక విద్య పట్ల ఆసక్తి చూపుతున్నారని, అయితే పోటీ ప్రపంచంలో నైపుణ్యంతో కూడిన విద్య ఉంటే తప్ప ఉద్యోగాలు పొందలేరని బెంగుళూరుకు చెందిన ఉన్నతి సంస్థ ప్రతినిధి రంజిత్ కుమార్ సూచించారు. నగరంలోని సెయింట్ జోషప్ ఐటిఐ కళాశాలలో నెలరోజులుగా ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న యునెక్స్ స్పోకెన్ ఇంగ్లీష్, లైఫ్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఉన్నతి సంస్థ అందిస్తున్న సిలబస్ విద్యార్థుల జీవితానికే కాకుండా ఉద్యోగం సాదించడానికి దోహద పడతాయన్నారు. యుగంధర్, అప్పలనాయుడు, అచ్చుతారావు, నాగభూషణం పాల్గొన్నారు.

గౌతు శిరీష గెలుపునకు కృషి

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష గెలుపునకు కృషి చేస్తామని టిడిపి పార్టీ కళింగ సామాజిక తరగతి నాయకులు స్పష్టం చేశారు. టిడిపి కార్యాలయంలో శనివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళింగ సామాజిక తరగతిలో మెజారిటీ 2019 సార్వత్రిక ఎన్నికలలో వైసిపి అభ్యర్థి, ప్రస్తుత మంత్రి సీదిరి అప్పలరాజు గెలపునకు కృషి చేశామన్నారు. వచ్చే ఎన్నికల్లో శిరీష గెలుపునకు కృషి చేస్తామని తీర్మానం చేశామన్నారు. త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లా సూర్యం, వజ్జ బాబూరావు, పిరియా రమణమూర్తి, దువ్వాడ హేమబాబు చౌదరి, కొర్ల కన్నారావు, వాయులపల్లి మాధవరావు, దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగరాజు, దానేటి పద్మజీ, యవ్వారి మోహన్, పైల చక్రధర్, దువ్వాడ శ్రీహర్ష సంతోష్, బమ్మిడి కర్రయ్య, తమ్మినాన గంగారం పాల్గొన్నారు.

శిరీషను కలిసిన ఎంఆర్‌పిఎస్ నాయకులు

మాట్లాడుతున్న వజ్జ బాబూరావు

టిడిపి సమన్వయకర్త వెంకన్న చౌదరిని ఎంఆర్‌పిఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గౌతు శిరీష గెలుపునకు తామంతా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు లోపించి తేజేశ్వరరావు, దాసరి తిరుమలరావు, జిల్లా ఇన్‌ఛార్జి శ్రీనివాస్, హిమశేఖర్, రవి మాదిగ, మీల జోగారావు, బోనెల భైరాగి, రాజారావు, తివడాన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబూరావు, ధనుంజయ

నాయకుల మధ్య మాటల యుద్ధం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పెసరపాడులో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో టిడిపి, వైసిపి నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. స్థానిక టిడిపి నాయకులు సంపతిరావు ధనుంజయ గ్రామానికి ఏమి అభివృద్ధి చేశామని చెప్పుకోవడానికి గ్రామానికి ఏలా వచ్చారని, స్థానిక కౌన్సిలర్ లేకుండా ప్రచారం ఏమిటని మంత్రికి సూటిగా ప్రశ్నించారు. దీనికి దీటుగా మంత్రి గ్రామానికి ఏమి అభివృద్ధి చేశానో నాకు, గ్రామస్తులకు తెలుసని, నీ లాంటి టిడిపి నాయకులకు చెప్పనవసరం లేదని అన్నారు. దీంతో టిడిపి, వైసిపి నాయకుల మధ్య కొద్ది సమయం మాటల యుద్ధం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్, మల్లా శ్రీనివాసరావులు పెసరపాడు ధనుంజయ ఇంటికి చేరుకొని మాట్లాడారు. వైసిపి చేసిన అభివృద్ధిని చెప్పుకోలేకే ఇలా వ్యవహరిస్తున్నారని అన్నారు. వీరితో టిడిపి నాయకులు సప్ప నవీన్, సాసుమాన చంద్రమౌళి ఉన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి- ఎల్ఎన్‌పేట

ఉపాధి హామీ పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని పెద్దకోట సమీపంలో చెరువులో చేస్తున్న ఉపాధి కూలీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పనిలో రెండు పూటలా పని రద్దు చేసి ఒక్క పూట పని పెట్టాలని, వేసవి అలవెన్స్ 40 శాతం ఇవ్వాలని, తాటి కోసం రూ.పది, గుణపాముకు రూ.50, తట్టకు రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మండుటెండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలన్నారు. మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. కోట్లాది మందికి అన్నం పెట్టే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. 200 రోజులు పని దినాలు కల్పించి రూ.600 చెల్లించాలన్నారు. ఉపాధి కూలీ మృతి చెందితే రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో లోకాగాన సుశీల, ఆదిలక్ష్మి, గౌతమి పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

ఎన్నికల నిర్వహణపై అప్రమత్తం

పలాస : శిక్షణ ఇస్తున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- టెక్కలి

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనున్న సిబ్బంది తమ విధులపై అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో పిఒ, ఎపిఒలకు రెండో శిక్షణా శిబిరాన్ని శనివారం ఏర్పాటు చేశారు. శిక్షణలో భాగంగా ప్యానల్ బోర్డు ద్వారా జరుగుతున్న వీడియో పాఠాల్ని విన్నారు. శిక్షణలో ఎంఇఒలు దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, నర్సింహులు, అన్నుపురం చిన్నారావు, సంపతరావు ఆప్పలరాజు, చిన్నవాడు పాల్గొన్నారు.

పోలింగ్‌పై అవగాహన అవసరం

పలాస : మే 13న జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. కాశీబుగ్గలో ఎన్నికల పిఒ, ఎపిఒలకు పోలింగ్‌పై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ సమయంలో జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.వి.ఎస్.నాయుడు, రెవెన్యూ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బి-ఫామ్‌ను అందుకుంటున్న నరసింహమూర్తి

నరసింహమూర్తికి బి-ఫామ్ అందజేత

ప్రజాశక్తి- నరసన్నపేట

పిసిసి అధ్యక్షులు వై.ఎస్.షర్మిల నరసన్నపేట కాంగ్రెస్ అభ్యర్థి నరసింహమూర్తికి బి-ఫామ్‌ను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థి మాట్లాడుతూ ఇండియా ఫోరం విజయానికి కార్యకర్తలతో కలిసి పనిచేస్తానని అన్నారు. నామినేషన్ తరువాత గ్రామాల్లో ప్రచారం చేపడతామని తెలిపారు.

లక్ష్మీనారాయణతో అనిల్‌రాజ్

'జై భారత్' అభ్యర్థిగా అనిల్‌రాజ్

పలాస : జై భారత్ నేషనల్ పార్టీ తరుపున పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా కాశీబుగ్గకు చెందిన న్యాయవాది జి.ఎం.ఎస్.అనిల్ రాజును ఆ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ తనకు బి-ఫారం అందజేశారని అనిల్‌రాజ్ తెలిపారు. ఈ నెల 24న నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. ఆయనతోపాటు ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ బాలకృష్ణ పట్నాయక్, బద్రి సీతమ్మ ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న డ్వాక్రా మహిళలు

డ్వాక్రా మహిళల ఆర్థికసాయం

నౌపడ: సంతబొమ్మాళి మండలం ఆకాశలకవరం పంచాయతీలో పేద కుటుంబం చెందిన తుంగాన ఉష కుమార్తె వివాహానికి పలువురు డ్వాక్రా మహిళలు శనివారం ఆర్థికసాయం అందజేశారు. పంచాయతీ పరిధిలోని సుగ్గువానిపేట, సీరపువానిపేట, గూలవానిపేట గ్రామాలకు చెందిన 44 మంది మహిళా సంఘాల సభ్యులు రూ.55,000 నగదును సేకరించారు. దీనికి ఎఎంసి చైర్మన్ సుగ్గు పుణ్యవతి కుమారుడు రామిరెడ్డి అదనంగా రూ.5 వేలు కలిపారు. మొత్తం రూ.60 వేలు గదును పుణ్యవతి చేతుల మీదుగా ఉషకు అందజేశారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘం అధ్యక్షులు నీలవేణి, ఉపాధ్యక్షులు పునీత, సుగ్గుదాలమ్మ, సిఎఫ్ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు చేరిక

నందిగాం : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి అత్యధిక మెజారిటీతో గెలిచేందుకు పార్టీ శ్రేణులంతా పనిచేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలం నిమ్మడ క్యాంప్ కార్యాలయంలో నందిగాం మండలం సింగపురానికి చెందిన ఎపి మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగాన తిరుపతిరావుతో పాటు మరో 30 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి శనివారం చేశారు. వీరికి అచ్చెన్నాయుడు టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తూలుగు మహేష్, తాడి సింహాద్రినాయుడు, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టిడిపిలోకి ఆహ్వానిస్తున్న అచ్చెన్నాయుడు

తగాదాలకు పోవద్దు

అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ఎన్నికల వేల గ్రామంలో ఎవ్వరితోనూ ఎలాంటి తగదాలు పడకుండా మీకు నచ్చిన వారికి పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, టెక్కలి సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మండలంలోని కన్నేవలసలో పోలీస్‌లు, ఎన్నికల అధికారులతో కలిసి శనివారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మీ గ్రామానికి చెందిన ఆరుగురుపై రౌడిషీటర్ ఉందని, ఈ గ్రామ ప్రజలు ఎవ్వరు గొడవులు, తగదాలు పడకుండా తమకు నచ్చిన పార్టీకి ఓటువేసుకొని ఇంట్లో ఉండాలని సూచించారు. అలా కాకుండా తగదాలు పడితే వారికిపై కఠిన చర్యలు, జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఎవరైన గ్రామంలో గొడవలకు దిగితే పోలీస్‌కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం పోలీసులతో కలిసి గ్రామంలో కవాత్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.పద్మజ, తహశీల్దార్ లచ్చుపాత్రో, టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ సూర్యచంద్రమౌళి, కోటబొమ్మాళి ఎస్ఐ షేక్‌మహ్మద్ అలీ పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం

అప్పలరాజు నుదిటికి తిలకం దిద్దుతున్న మహిళ

పలాస : జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ అధికారంలోనికి వస్తేనే పథకాలు కొనసాగుతాయని, చంద్రబాబును సిఎం అయితే అవి నిలిచిపోతాయని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మున్సిపాలిటీలో 5,6,7,8వ వార్డుల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో ఏ ఇంటికైనా ఒక్క రూపాయి సహాయం అందించారా? అని ప్రశ్నించారు. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు ఏదో ఒక సంక్షేమ పథకం అందించామని అన్నారు. రూ.700 కోట్లతో శుద్ధజలాల వాటర్ ప్రాజెక్టుతో ఇంటింటికీ కుళాయి ద్వారా నీటిని అందించి సమస్యను పరిష్కరిస్తున్నామని అన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ పేడాడ తిలక్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బుజ్జి, కౌన్సిలర్లు బమ్మిడి రమణమ్మ, పిచుక విజయ్, గుజ్జు జోగారావు, బెల్లాల శ్రీను, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాలంటీర్ల రాజీనామా

రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న వాలంటీర్లు

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో తొమ్మిది మంది వాలంటీర్లు రాజీనామా చేశారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో రాజీనామా పత్రాలను మున్సిపల్ అధికారులకు శనివారం అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్'తో సంక్షేమ పాలన

ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పలాస

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అమలు చేయనున్న సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రంలో సుస్థిర పాలన సాధ్యమవుతుందని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 13 వార్డులో టిడిపి ఇన్‌ఛార్జి కొత్త రాజేశ్వరి సత్యం ఆధ్వర్యాన శనివారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధికీ నోచుకోలేదని అన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక తాగునీరు అందక ప్రజలు అల్లాడుతురన్నారు. అన్నీ ఇచ్చాం అంటూనే అధిక ధరలతో ప్రజల సొమ్మును దోచుకుంటున్నారని, దీన్ని ప్రజలు గుర్తించాలని అన్నారు. టిడిపి అధికారంలోకి వస్తే రైతుబజార్ ఏర్పాటు, డిఫెన్స్ అకాడమీ, సిల్క్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కొత్త సత్యం, గురిటి సూర్యనారాయణ, కృష్ణారావు, గోల చంద్రరావు, బోస్ బాబు, అంబటి కృష్ణమూర్తి, ఢిల్లేశ్వరి, భీమ, రమణ, కోటి, ఢిల్లీ, జామి సత్యం, సింహాచలం పాల్గొన్నారు.

టెక్కలి : టిడిపి మండలస్థాయి నాయకులు టెక్కలి పట్టణంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. స్థానిక పెద్ద బ్రాహ్మణవీధిలోని చేపట్టిన ప్రచారంలో భాగంగా సూపర్ సిక్స్ ఆమలుకు సంబంధించిన పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, మెండ దమయంతి, హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, మామిడి రాము, కోఠారి పండా, ప్రపుల బరిడో, నర్సింగ్ ప్రదాన్, పూర్ణచంద్ర ప్రదాన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

24న నామినేషన్

ప్రజాశక్తి- కవిటి

ఈ నెల 24న నామినేషన్ వేస్తున్నామని టిడిపి అభ్యర్థి ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం రామయ్యపుట్టుగ గ్రామంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నామినేషన్ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జనసేన నాయకుడు దాసరి రాజు, నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రచారం చేస్తున్న ప్రకాష్

'విజయ'మే లక్ష్యంగా...

ప్రజాశక్తి- కవిటి

కడియాల ప్రకాష్ కలియ తిరిగేస్తున్నారు. వైసిపి మండల అధ్యక్షునిగా, ఎంపిపి ప్రతినిధిగా ఈ ఎన్నికల్లో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల 'విజయ'మే లక్ష్యంగా అహరం శ్రమిస్తున్నారు. ఏదేమైనా ఈసారి మండలంలో పూర్తిస్థాయిలో వైసిపి ఆధిపత్యం సాధించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ ముందుకు సాగుతున్నారు. మండలంలోని అందరు నాయకులను కలుపుకుంటూ గడప గడపా తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీరిక లేకుండా ప్రచారంలో పాల్గొంటూ మిగతా సమయాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీలో లోటుపాట్లు అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ వైపు ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, మరోవైపు ఎమ్మెల్సీ రామారావుతో సమానంగా ప్రచారంలో పాల్గొంటూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నారు. అనుక్షణం పార్టీ అభ్యర్థి విజయానికి ప్రకాష్ చేస్తున్న కృషిని గుర్తించి పార్టీ శ్రేణులు ఆయన వెంట నడుస్తున్నాయి.

వంకులూరులో ఎలుగు సంచారం

సంచరిస్తున్న ఎలుగు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని వంకులూరులో ఎలుగు సంచారించడంతో కలకలం రేపింది. శుక్రవారం రాత్రి గ్రామంలోకి చొరబడిన ఎలుగును చూచిన గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఎలుగు చొరబాటుపై అటవీశాఖ అధికారులకు శనివారం సమాచారం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఎలుగులను బంధించి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానికులు అధికారులను కోరారు. ఎలుగులు సంచారంతో ఉద్దానం తీరప్రాంత గ్రామాల్లో ప్రజలు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రాణాలు అరచేతపట్టికొని తెరిగే పరిస్థితులు దాపురించాయి.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల పరిధిలోని కార్మికులందరూ మే 13న జరుగుతున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని టెక్కలి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆర్.రాధాకుమారి ఒక ప్రకటనలో సూచించారు. గ్రానైట్, ఇతర ఫ్యాక్టరీలు, హోటళ్లు, డాభాలుల్లో పనిచేస్తున్న కార్మికులందరూ పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేయాలని అన్నారు. వేతనంతో కూడిన సెలవు, ప్రయాణ ఖర్చులు యజమానులు ఇవ్వాలన్నారు.

రూ.లక్షలు వృథా... తాగునీటి వ్యథ

- సున్నాడలో దాహం కేకలు
- పట్టించుకోని అధికారులు

ఆ గ్రామంలో తాగునీటి కష్టాలు వర్ణనాతీతం. ఎన్నో ఏళ్లుగా తాగునీరు కోసం తిప్పలు తప్పడం లేదు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని గుర్తించి పాలకులు, అధికారులు రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన తాగునీటి పథకాలు మూలకుచేరడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు భూగర్భ జలాలు అడుగంటిపోగా, మరోవైపు అర కిలోమీటరు దూరానికి వెళ్లి నీటిని తెచ్చుకొనే పరిస్థితి ఏర్పడింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించకపోవడంతో పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి- పలాస

పలాస మండలం సున్నాడలో సుమారు 2,500 మంది జనాభా నివసిస్తున్నారు. గ్రామానికి రెండు బావులు, మూడు బోర్లు ఉన్నాయి. వాటి పైనే ఆధారపడి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. అయితే ఒకేఒక్క బోరు పని చేస్తుండగా, రెండు బావులు పూర్తిగా అడుగంటి పోయాయి. దీంతో తాగునీరు కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇదిలా ఉండగా గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని సుమారు పన్నెండు ఏళ్ల క్రితం రూ.3.50 లక్షల వ్యయంతో నీటి పథకం ఏర్పాటు చేశారు. గ్రామానికి సమీపంలో ఉన్న నేల బావి నుంచి పైపులైన్ ద్వారా కుళాయిలతో నీటిని సరఫరా చేశారు. ఆ పథకం మూలకు చేరడంతో అప్పటి ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు మరో రూ.16 లక్షల వ్యయంతో తాగునీటి ట్యాంకు నిర్మాణం చేపట్టారు. పాత

తాగునీటి ట్యాంకు

కుళాయిలకు అనుస ంధానం చేసి పైపులైన్ ద్వారా నీటిని సరఫరా చేశారు. ఆ పథకం కూడా మూడునాళ్ల ముచ్చటగా తయారైంది. దీంతో అప్పటి నుంచి ఇప్పటి వరకు తాగునీటి పథకాలు పనిచేయడం లేదు. దీంతో తాగునీరు కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షల వ్యయంతో నీటి పథకాలు ఏర్పాటు చేసిన తాగునీటి కష్టాలు ప్రజలకు తప్పడం లేదు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

ట్యాంకుల ద్వారా సరఫరా నిల్

గతంలో వేసవి సమీపిస్తున్న తరుణంలో ఏయే ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందని గుర్తించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేసేవారు. ఆ గ్రామంలోని జనాభా ప్రాతిపదికన రెండు పూటలు నీటిని సరఫరా చేసేవారు. అయితే సుమారుగా ఐదేళ్లుగా ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయడం మానేశారు. దీంతో ప్రజలకు నీటికష్టాలు తప్పడం లేదు. తాగునీటి కోసం గ్రామ సమీప ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల నేల బావి, బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులో నీరు ఎండిపోవడంతో స్నానాలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని, మా గోడు ఎవరూ పట్టించుకోవడం లేదని మహిళలు వాపోతున్నారు.

నీటికి కష్టాలు పడుతున్నాం

నీటి కోసం నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. బావులు ఎండి పోయాయి. బోర్లు పాడైన బాగు చేయడం లేదు. పంట భూముల్లో ఉన్న నేల బావులకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నాం.

- బలగ విజయ, సున్నాడ

మూలకు చేరిన కుళాయి
(ఇన్‌సెట్‌లో అడుగంటిన బావి)

నీటి కోసం ఎక్కడకు వెళ్లాలో? ఏమి చేయాలో? అర్థం కాక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చొరవ చూపి గ్రామానికి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయంపై ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ దుర్యోధనకు వివరణ కోరగా గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందనే మాట వాస్తవమే అన్నారు. మరోరెండు రోజుల్లో రూ.700 కోట్ల వ్యయంతో నిర్మించిన తాగునీటి పథకం ద్వారా తాగునీరు అందేలా చర్యలు చేపడతామన్నారు. మరోవైపు పాత తాగునీటి పథకాన్ని సరిచేసి నీరు అందేలా చూస్తామని చెప్పారు. పాడైన బోర్లకు మరమ్మతులు చేపడతామని తెలిపారు.

నీటిని సరఫరా చేయాలి

తాగునీటి పథకాలు పని చేయడం లేదు. ప్రతి వేసవిలోనూ నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. అధికారులు చొరవ చూపి ప్రస్తుతానికి ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేస్తే నీటి ఇబ్బంది తీరుతుంది.

- కుమ్మరి జమున, సున్నాడ

మండే ఎండ... కూలీలకు ఏది అండ..?

- ఉపాధి పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు
- ఎండ తీవ్రతకు సొమ్మసిల్లుతున్న కూలీలు
- పట్టించుకోని ప్రభుత్వం

ప్రతి ఏటా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో గ్రామాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోతున్నాయి. ఇటువంటి సమయంలో జీవనోపాధి కొరకు పల్లె ప్రాంతాల నుంచి ఇతర ప్రాంతాలకు వలసలు పెరిగాయి. ఈ వలసలను నివారించి స్థానికంగానే పనులను కల్పించేందుకు జాతీయ ఉపాధిహామీ పథకాన్ని అమలు చేశారు. అయితే పనులు నిర్వహించే చోట సరైన సౌకర్యాలు, వసతులును కల్పించకపోవడంతో కూలీలు తల్లడిల్లిపోతున్నారు. వేసవికాలం ప్రారంభం కావడంతో ఉదయం ఎనిమిది గంటలకే భానుడు భగభగా మంటూ పంజా విసురుతున్నాడు. అయితే పని ప్రదేశంలో నిలువనీడ, మంచినీళ్లు లేకపోవడంతో కూలీలు అల్లాడిపోతున్నారు. వెరసి సదాశయంతో ప్రారంభించిన ఈ బృహత్తర పథకం రానురానూ ప్రభుత్వాల విధానాలతో కూలీలకు కన్నీళ్లను మిగులుస్తోంది.

ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి- పొందూరు

జిల్లాలో 2024-25కు సంబంధించి జాతీయ ఉపాది హామీ పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనిప్రదేశాల్లో కూలీలకు కల్పించాల్సిన సౌకర్యాలను

కొంచాడలో చెరువు గట్టుపై సేద తీరుతున్న కూలీలు

కల్పించకపోవడంతో ఎండ లోనే పనులు చేస్తూ అల్లాడి పోతున్నారు. పలుచోట్ల ఎండ వేడిని తట్టుకోలేక సొమ్మసిల్లిపోతున్నారు. అలాగే వడదెబ్బ కారణంగా మృతి చెందిన సంఘటనలు చోటు చేసు కుంటున్నాయి.

జిల్లాలో ఉపాధి పనులు

జిల్లాలో 914 పంచాయతీలకు సంబంధించి సుమారు 4.28 లక్షల జాబ్ కార్డులకు సంబంధించి సుమారు 7.31లక్షల మంది కూలీలు పని చేస్తున్నారు. ఇందులో క్రియాశీలకంగా 3.75 లక్షల జాబ్ కార్డులు ఉండగా సుమారు 5.93లక్షల మంది కూలీలు ఉన్నారు.

కూలీలకు కనీస వసతులు కరువు

ఉపాధి పనులు వద్ద కూలీలకు సరిపడే విధంగా సౌకర్యాలను కల్పించాలి. ప్రధానంగా పనిచేసే సమయంలో ఎండ నుంచి కొంత ఉపశమనం పొందేందుకు నీడకోసం టెంట్లును ఏర్పాటు చేయాలి. అయితే సుమారు ఆరేళ్లుగా టెంట్లును ప్రభుత్వం అందించడం లేదు. దీంతో సమీపంలో గల ముళ్లచెట్లు, తాటిచెట్లు నీడన సేదతీరుతున్నారు. అలాగే ఎండలో దాహార్తిని తీర్చుకునేందుకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాల్సి ఉంది. కూలీలే ఇంటినుంచి మంచినీళ్ల సీసాలను తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. అలాగే పనిచేసే సమయంలో గాయాలకు గురైతే ప్రథమచికిత్స పెట్టెలను గతంలో సరఫరా చేసేవారు. వెంటనే చికిత్సను అందించేందుకు అవసరమైన ప్రథమ చికిత్స పెట్టెలు ప్రస్తుతం కానరావడం లేదు. అలాగే గత ప్రభుత్వాల హయాంలో వేతనదారులకు గునపాలను, పారలను అందించేవారు. అంతేకాకుండా గునపాలను సాన పెట్టేందుకు రూ.10లు ఇచ్చేవారు. ప్రస్తుతం వాటిని కూడా పదేళ్లుగా ప్రభుత్వం ఇవ్వడం లేదు. దీంతో పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కానరావడం లేదని కూలీలు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

ప్రథమ చికిత్స పెట్టెలను అందజేశాం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పని ప్రదేశాల్లో నీడకోసం కర్రలతో పందెరలను వేయమని క్షేత్ర సహాయకులకు సూచించాం. అలాగే కూలీలు కూడా తమకు అనువైన మంచినీటిని ఇంటినుంచే తీసుకు వస్తున్నారు. ప్రథమ చికిత్స పెట్టెలను అందజేశాం. పని ప్రదేశాల్లో వసతుల లేమిపై ఉన్నతాధికారులకు నివేదించాం.

- పి.శ్రీనివాసరావు, ఎపిఒ, పొందూరు

మంచినీళ్లు తెచ్చుకుంటున్నాం

పనిచేసే సమయంలో దాహార్తిని తీర్చు కునేందుకు తాము ఇంటి వద్ద నుంచే మంచినీళ్లు తీసుకు వస్తున్నాం. గతంలో మంచినీటి సరఫరా, మజ్జిగ ఇచ్చేవారు. అంతే కాకుండా మంచి నీటి కోసం ప్రత్యే కంగా డబ్బులు కూడా ఇచ్చేవారు. ఇప్పుడు ఇవ్వడం లేదు. అలాగే పనిచేసిన తరువాత సేద తీరేందుకు కనీసం నీడ కూడా లేకపోవడంతో చెట్టు చాటున సేదతీరాల్సి వస్తుంది.

- పి.వెంకటలక్ష్మి, కొంచాడ, పొందూరు

ర్యాలీగా వెళ్తున్న రామ్మోహన్ నాయుడు, రమణమూర్తి

రమణమూర్తి నామినేషన్ జనసంద్రం

ప్రజాశక్తి- పోలాకి

జనసంద్రంలో నరసన్నపేట పట్టణం పసుపు రంగులా మారింది. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి శనివారం నామినేషన్ వేశారు. ఉదయం 8 గంటలకు మబగాంలో కార్యకర్తలతో బయలుదేరారు. నరసన్నపేట పైడిపల్లి అమ్మవారిని దర్శించుకుని అక్కడి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం 12 గంటలకు ఆర్‌ఒకి నామినేషన్ పత్రం అందజేశారు. అనంతరం ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రమణమూర్తి మాట్లాడుతూ నరసన్నపేట ఎమ్మెల్యేగా నన్ను గెలిపించి కానుకుగా ఇవ్వడానికి నియోజకవర్గం ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పడానికి శనివారం వచ్చే జనసంద్రమే నిదర్శనమని అన్నారు. టిడిపి అభిమానం ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రజలు ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. సైకో పాలన పోయి చంద్రబాబు నాయకత్వం రావాలని ప్రజలు కోరుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బగ్గు సుగుణమ్మ, ధర్మాన తేజ్‌కుమార్, ఎం.వి.నాయుడు, డోల జగన్, జల్లు చంద్రమౌళి, బలగ ప్రవీణ్‌కుమార్, భైరి భాస్కరరావు పాల్గొన్నారు.

కృపారాణి ఆస్తుల వివరాలు

టెక్కలి : టెక్కలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ కిల్లి కృపారాణి తనకు ఉన్నటువంటి ఆస్తుల వివరాలను అఫిడవిట్ ఎన్నికల రిటర్న్ అధికారి నూరల్ కమర్‌కు శుక్రవారం అందజేశారు. ఆమె అందజేసిన వివరాల మేరకు చరాస్తుల రూ.1.94 కోట్లు ఉండగా, స్థిరాస్తులు రూ.1.89 కోట్లు, రూ.73.44 లక్షలు రుణాలు ఉన్నట్లులో అందులో పేర్కొన్నారు.

'దువ్వాడ' ఆస్తులు ఇవే..

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న దువ్వాడ శ్రీనివాస నామినేషన్‌తో పాటు ఆస్తుల వివరాలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ నూరల్ కమర్‌కు జతపరిచి శుక్రవారం అందజేశారు. తన వ్యక్తిగత ఆస్తులు వివరాలు చరస్థలు రూ.15 లక్షల నగదు, బ్యాంకు అకౌంట్‌లో రూ.78 లక్షలు, 4 కేజీల 616 గ్రామల బంగారం, స్థిర ఆస్తులు విలవ రూ.4,41,86,956, అప్పు రూ.54,65,973 ఉన్నాయి. 12/2011న నౌపడ పోలీస్ స్టేషన్‌లో, 4/2011న సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో, 16/2011న నౌపడ పోలీస్ స్టేషన్‌లో, 17/2011 నౌపడ పోలీస్‌స్టేషన్‌లో కాకరాపల్లిలో పవర్ ప్లాంట్ ఉద్యమంపై కేసు నమోదు నమోదయ్యాయి. వ్యాపారానికి సంబంధించిన 9/10న పర్లాకిమిడి క్వారీపై, 37/12న క్వారీపై విజిలెన్స్ బరంపురంలో కేసు నమోదయ్యాయి.

అరసవల్లిని సందర్శించిన నవీన్ సోనీ

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని శనివారం ఐఆర్‌ఎస్ అధికారి, ఎన్నికల వ్యయ పరిశీలకులు నవీన్ కుమార్ సోనీ సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయనకు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణ మాచార్యులు అందజేశారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న నవీన్‌కుమార్ సోని